# నాగరికము

వెంకటేశ్వర్లు మలకాపురము నుంచి సైకిలుమీద లేడీడాక్టరు కొరకూ టౌనులోనికి వచ్చాడు. అతడి భార్య శకుంతల గతరాత్రి నుండీ ప్రసవవేదన పడుతున్నది. ఇంట్లో ఉన్నవాళ్ళందరూ ఆతురతకొద్దీ తలకొకమాటా అంటున్నారు కొందరు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళితే మంచిదంటున్నారు. ఎంతడబ్బు ఖర్చు అయినా డాక్టరును ఇంటికి తీసుకొనివస్తే మంచిదంటున్నారు కొందరు. వెంకటేశ్వర్లుకు ఎటూ తోచక ఎంత ఖర్చు అయినా వైద్యురాలిని ఇంటికి తీసుకొని వెళ్ళితేనే మంచిదేమోనని టౌనుకు వచ్చాడు.

డాక్టరు పంకజవల్లీశర్మ మంచి హస్తవాసి గల వైద్యురాలు. కానుపుకేసులలో ఇంతవరకూ ఆమెకు అపజయమన్నది లేదు. ఆమె పేరు గ్రామగ్రామాలలో ప్రాకిపోయింది. నాలుగు సంవత్సరాల క్రిందట నేత్రవైద్యములో ప్రవీణుడైన రామశర్మను వివాహము చేసుకొన్నది. డాక్టరు పంకజవల్లీశర్మ అంటే అక్కడి మహిళామణుల కందరికీ ఎంతో అభిమానము. విద్యావంతురాలనీ విజ్ఞానవంతురాలనీ వైద్యములో సాటిలేని ప్రజ్ఞకలదనీ ఆమె నొక దేవతగా భావించారు. అక్కడ మహిళాసంఘము పక్షమున స్థాపించబడిన ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్లలో వారానికి రెండు పర్యాయములు ఉపన్యసించ వలసినదని ఎంతగానో ప్రాధేయపడి ఆమెను ఏర్పాటు చేసుకొన్నారు.

ఉపన్యాసాలు విన్నవారు ఆమె వచో మాధుర్యానికీ విషయవైశద్యానికీ సమ్మోహితులైపోయేవారు.

ఆమె ఉపన్యాసాలను గురించి ఎప్పటికప్పుడు వెంకటేశ్వర్లూ శకుంతలా పత్రికలలో చదువుతూ ఉండేవారు. టౌను లోనికి రాగానే వెంకటేశ్వర్లకు డాక్టరు పంకజవల్లీశర్మ పేరు తటాలున జ్ఞాపకము వచ్చి ఆమె యింటికి వెళ్ళాడు, ఆమె ఏదో పనిమీద బైటికి వెళ్ళినదని ఒక గంటసేపటిలో వస్తుందనీ తెలిసింది

ఉదయము తొమ్మిది గంటలకు ఇంటి నుండి బయలుదేరాడు వెంకటేశ్వర్లు. అప్పుడే పదకొండు గంటలు దాటిపోయినాయి అతడిని ఆకలి ఒకప్రక్కనా శకుం తలను గురించిన ఆతురత ఒక ప్రక్కనా వేధించ నారంభించినవి. ఇంకొక గంట, అంటే పన్నెండు గంటలు దాటితేనే గాని డాక్టరు రాదు.

డాక్టరువచ్చేవరకూ క్షణమొక యుగముగా లెక్కించుకుంటూ వాకిటి వరం డాలో పచారుచేయటము మొదలుపెట్టాడు వెంకటేశ్వర్లు.

సుమారు ఒంటిగంటకు డాక్టరు పంకజవల్లీశర్మ కారు పోర్టికోలోకి వచ్చి ఆగింది. ఆమె కారు దిగుతుండగానే ఎదురుగా వెళ్ళి తన సంగతిని చెప్పుకున్నాడు వెంకటేశ్వర్లు ఒక అరగంటలో వస్తానని ఆమె లోపలికి వెళ్ళింది.

అరగంట-ముప్పావుగంట గడచిపోయినది గాని వైద్యురాలు బయటికి రాలేదు

భార్యను గురించి ఆందోళన పడుతున్న వెంకటేశ్వర్లుకు ఆమె చేస్తున్న ఆలస్యానికి విసుగుపుట్టుతున్నది. కాని మరొకసారి ఆమెను పిలిచి తొందరపెట్టితే 'పల్లెటూరి వాడని' అంటుందేమోనని భయపడి తలుపుదగ్గరగా గోడకు ఆనుకొని నిలువబడ్డాడు వెంకటేశ్వర్లు.

లోపలినుంచి ఏవో మాటలు వెంకటేశ్వర్లుకు అస్పష్టముగా వినుపించాయి.

"నేను ఆలస్యముగా వచ్చానని కోపము వచ్చిందా? ... ఆఁ? . ఎందుకూ అంత కోపము?" ఎంతో బుజ్జగిస్తున్నట్లుగా బతిమిలాడుతున్నట్లుగా ఉన్నది కంఠ ధ్వని, ఆ ధ్వని డాక్టరు పంకజవల్లీ శర్మగి.

కోపము వచ్చిన భర్తను బ్రతిమిలాడుతున్నది కాబోలు. ఆమె ఎంతటి విద్యావతి అయినా ఎంతడబ్బు సంపాదించి పేరు తెచ్చుకుంటున్నా భర్తను బ్రతిమి లాడుకొని ప్రాథేయపడటము స్త్రీకి తప్పదుకదా అనుకున్నాడు వెంకటేశ్వర్లు. 'విక్టోరియా రాణితో-ఆల్బర్టు అప్పుడప్పుడు తగాదాపడి ఇలాగే బ్రతిమిలాడించుకొనే వాడట. ఎట్లాగయినా పురుషుడు పురుషుడే' అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆ గదిలోని సంభాషణను చివరవరకూ వినవలెనని వెంకటేశ్వర్లుకు కుతూ హలము కలిగి తలుపుకు చెవి ఆనించి వినటము మొదలుపెట్టాడు

"నేను ఇంటికి రావటము ఆలస్యమైనదని దానికెంత కోపము వచ్చిందో చూశారా? నేను అక్కడికి వెళ్ళానన్నమాటే గాని నా ప్రాణమంతా దీని మీదనే కొట్టుకొని పోయిందంటే నమ్మండి....చూడండి నేను బిస్కట్లుయిస్తే తీసుకోదుట దగ్గరికి రమ్మంటే రాదుట....పోనీ మీరు దగ్గరకు పిలిచి కూర్చో బెట్టుకోండి. ముఖము చిన్నబుచ్చుకొని ఆమూలకు వెళ్ళి ఎట్లా నిలబడిందో చూడండి".

ఈ కంఠధ్వని వైద్యురాలిది. ఆమె ఎవరిని గురించి మాట్లాడుతున్నది? వెంకటేశ్వర్లుకు అర్థము కాలేదు.

"దా. .దా ..నాదగ్గరికి రా... మమ్మీ మీద కోపము వచ్చిందా?"

ఇది స్పష్టముగా మగ గొంతు - డాక్టరు శర్మదై యుంటుంది అనుకు న్నాడు వెంకటేశ్వర్లు.

"అబ్బ! దీనికెంత కోపమనుకున్నారు? నేను హాస్పిటల్‌కు వెళ్లుతూ మొన్న దీనిని కారులో కూర్చోబెట్టుకొని తీసికొని వెళ్లుతున్నాను. అక్కడ నాతో కూడా పనిచేసే డాక్టరు తన కారు చెడిపోయిందని ఈకారులో వస్తానంటే సరేనని ముందు సీటులో కూర్చోమన్నాను. ఆస్థలము దీనిదట. ఎంతలాగినా అక్కడ నుంచి రాక మారాము చేసింది. నేను బలవంతముగా ఎత్తుకొని నాఒడిలో కూర్చోబెట్టు కున్నాను. ఆకోపము మనసులో పెట్టుకొని ఆ రోజంతా నా దగ్గరికి రాలేదు "

తరువాత ముద్దుపెట్టుకున్న శబ్దము వినిపించింది వెంకటేశ్వర్లకు.

'అయితే...ఊరివారందరికీ జన్మనిరోధము గూర్చి ఉపన్యాసాలిచ్చి బిడ్డ లను కనవద్దని ఉపదేశించిన డాక్టరు పంకజవల్లీశర్మ ఇంట్లో చేసేది ఈపనా? ఈమె కూడా పిల్లలను కన్నదికదా...' అని విస్మితుడైనాడు వెంకటేశ్వర్లు.

అంతలో కళ్లు జిగేలుమనే రంగుచీర కట్టుకొని ప్రక్కతలుపు తెరుచుకొని బయటికి వస్తూ 'ఆలస్యమైనట్లుంది ..రండి వెళ్లుదాము' అంటూ కారును సమీపిం చింది వైద్యురాలు.

'ఎంత వైద్యులైనా-స్త్రీలకు ఇంటినుంచి బయటికి రావాలంటే ఎంతో సర్దుబాటు కావాలి'అని నవ్వుతూ వెంకటేశ్వర్లు అక్కడనుండి కదిలి కారు దగ్గ

రికి వచ్చి 'నా సైకిలు ఇక్కడే ఉంచుతాను. తరువాత తెప్పించుకుంటాను' అని కారులో ముందు సీటులో కూర్చున్నాడు.

గదిలోనుండి వరెండాలోకి వచ్చి నిలువబడిన ఆయన డాక్టరు శర్మ అయి ఉంటాడు. ఎరుపు డాలు గల కుక్కను ఎత్తుకొని 'మమ్మీనిచూడు... తొందరగా రమ్మని చెయ్యి ఊపు' అంటూ కుక్కను ముద్దు పెట్టుకుంటున్నాడు.

వెంకటేశ్వర్లకు కలిగిన ఆశ్చర్యానికి అంతులేదు ఈ కుక్కపిల్లల సంతానముతో ఆనందిస్తూ తనను ఎంతసేపు వాకిట్లో నిలబెట్టిందీ వైద్యురాలు! బాగున్నది! అయినా.. ఇద్దరూ బాగా సంపాదిస్తూ మంచి ఆరోగ్యముగా ఉన్న దంపతులు కదా, ఈ కుక్కపిల్లలనూ కుందేలుపిల్లలనూ పెంచుతూ పిల్లల సరదా తీర్చుకోవటము ఏంకర్మము?" వెంకటేశ్వర్లు తనకు కలిగిన విస్మయమును దాచుకొనలేక ముఖముమీదికి కనబరచాడు.

తన కుక్కను చూచి సంతోషపడుతున్నాడనుకొని "ఏమండీ! మా హైనీ స్వీట్‌గా లేదూ?" అని వెంకటేశ్వర్లను ప్రశ్నించి 'డార్లింగ్! టా...టా...'అంటూ చెయ్యి ఊపింది డాక్టరు పంకజవల్లీ శర్మ.

డాక్టరు శర్మ తిరిగి 'టా...టా...'అంటూ కుక్కపిల్ల చేత చెయ్యి ఊపించాడు.

వైద్యదంపతుల సంతానపు ముచ్చటలను చూసి 'ఏమి నాగరికము!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. అతడికా విస్మయములో భార్య ప్రసవవేదనను గురించిన తలంపులు కొంతసేపటివరకూ దూరమైనవి.